
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 2 మార్చి 2024 | 5



అనపర్తిలో 'బహిరంగ చర్చ' రచ్చరచ్చ

- మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి చర్చా పిలుపునకు స్పందించని స్థానిక ఎమ్మెల్యే
- రామకృష్ణారెడ్డిని అడ్డుకున్న పోలీసులు
- నల్లమిల్లిని అరెస్టు చేసి పోలీసుల హైడ్రామా

8వ పేజీ

ఫ్యాన్‌లో.. ఉక్కపోత



- జిల్లాలో వైసీపీ అభ్యర్థుల ఎంపికలో గందరగోళం
- అనేక జిల్లాల్లో విడతలవారీ జాబితాలు వెల్లడవుతున్నా ఇక్కడింకా అస్పష్టతే
- కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, తుని సీట్లపై అధిష్ఠానం తర్జనభర్జన
- తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో కాకినాడ సిటీలో ద్వారంపూడి మార్పుపై ఊహాగానాలు
- ఆయన స్థానంలో భార్యకు టికెట్ ఇస్తారంటూ ప్రచారం
- కాదంటే కాపు సామాజికవర్గం నుంచి ఓ చోటా మహిళా నేత పేరు పరిశీలన
- దవులూరికి పెద్దాపురం టికెట్ అని జగన్ ప్రకటించినా అధికారిక ప్రకటనకు నో
- ఆయన్ను మార్చాలంటూ ఎంపీ అభ్యర్థి సునీల్ పదేపదే ఒత్తిడితో పునరాలోచన
- పిఠాపురం నుంచి పవన్ బరిలోకి దిగే అవకాశం ఉండడంతో వంగా గీత సీటు మార్పు యోచన
- శుక్రవారం అకస్మాత్తుగా గీత తాడేపల్లికి వెళ్లడంతో ఊహాగానాలకు మరింత ఊతం
- జగ్గంపేట, ప్రత్తిపాడులో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చినా పెద్దగా మార్పు లేకపోవడంతో కలవరం
- ఎవరి సీట్లకు ఎసరు వస్తుందోనని ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల్లో గుబులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైసీపీ అభ్యర్థుల ఎంపికపై ఇంకా పీఠముడి కొనసాగుతోంది. ఎవరెవరిని ఏయే స్థానాల్లో బరిలోకి దించాలనే దానిపై వైసీపీ అధిష్ఠానం తేల్చుకోలేకపోతోంది. అనేక జిల్లాల్లో విడతలవారీగా అభ్యర్థులను ప్రకటిస్తున్నా జిల్లాలో ఎవరెక్కడనే దానిపై మాత్రం స్పష్టత లేకపోవడంతో నేతలు, క్యాడర్‌ను గందరగోళానికి గురిచేస్తోంది. అసలు అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తారో తెలియక ఆందోళన రేగుతోంది. వాస్తవానికి ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో పార్టీ ఓటమి ఖాయమని తేలడంతో అక్కడున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలను వైసీపీ అధిష్ఠానం పక్కనపెట్టేసింది. వారి స్థానంలో కొత్త వారిని నియమించింది. ఇవికాకుండా మిగిలిన కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, తుని సీట్ల ప్రకటన లాంఛనమే అని అంతా భావించారు. కానీ పార్టీ మాత్రం ఈ టికెట్లపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో నేతల్లో టెన్షన్ పెరిగిపోతోంది. కాకినాడ సిటీలో వ్యతిరేకత ఎక్కువగా ఉండడంతో ఎమ్మెల్యే ద్వారంపూడి బదులు ఆయన భార్య లేదా కాపు సామాజికవర్గం నుంచి మరో నేత పేరును వైసీపీ పరిశీలిస్తోంది. పెద్దాపురం టికెట్ దవులూరిదేనని జగన్ గతేడాది ప్రకటించినా ఇంకా అధికారికంగా సీటు ఖరారు చేయడంలేదు. పిఠాపురం నుంచి పవన్ బరిలోకి దిగడం ఖాయమని ప్రచారం జరుగుతుండడంతో ఇక్కడున్న కొత్త ఇన్‌చార్జి వంగాగీత సీటు మార్చాలని వైసీపీ భావిస్తోంది. జగ్గంపేట, ప్రత్తిపాడులో కొత్త ఇన్‌చార్జులు వచ్చినా పార్టీ పరిస్థితి అసలేం బాగోలేదని ఎంపీ అభ్యర్థి నెత్తీనోరు బాదుకుంటుండడంతో ఇక్కడా మార్పులు, చేర్పులపై కసరత్తు జరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది.

ఏం అర్థం కావడం లేదు..

జిల్లాలో అధికార వైసీపీలో ఉక్కపోత ఎక్కువవుతోంది. ఒకపక్క అసెంబ్లీ ఎన్నికలు సమీపించినా ఇంకా అభ్యర్థుల ఎంపికలో గందరగోళం కొనసాగుతోంది. ఎవరిని ఎక్కడినుంచి బరిలోకి దించాలో అర్థం కాక వైసీపీ పెద్దలు తలపట్టుకుంటున్నారు. ఓటమి భయంతో ఇప్పటికే జిల్లాలో మూడు చోట్ల అభ్యర్థులను తీసేసి కొత్తవారిని నియమించినా పెద్దగా ఫలితం లేదని తేలుతుండడంతో ఏం పాలుపోని పరిస్థితి నెలకొంది. ఒకపక్క మొదట్లో టీడీపీ కూటమి నుంచి టికెట్ల ప్రకటన ఆలస్యం కావడంతో తామే అభ్యర్థుల విషయంలో ముందున్నామని వైసీపీ ప్రచారం చేసుకుంది. తీరా టీడీపీ, జనసేననుంచి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసిన తర్వాత సీన్ రివర్స్ అయింది. ఇప్పుడు టెన్షన్ అంతా వైసీపీని కమ్మేసింది. అసలు ఎవరు ఎక్కడినుంచి పోటీ చేయాల్సి ఉంటుంది? ఎవరికి టికెట్ ఉంటుందో అర్థంకాక ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు తలలు పట్టుకుంటున్నారు. ఒకపక్క విడతల వారీగా అనేక జిల్లాల్లో వైసీపీ అధిష్ఠానం టికెట్లు ప్రకటిస్తోంది. కానీ జిల్లాలో మాత్రం ఇంతకాలం ఏ ఇబ్బంది లేదని భావిస్తున్న కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, తుని సీట్లపై ఏ ప్రకటనా రాకపోవడంతో ఆయా నేతలు, క్యాడర్‌లో నిరాశ, నిస్సత్తువ ఆవహిస్తోంది. తమకు ఏ డోకా లేదని తెలిసినా ఎందుకు అధిష్ఠానం పేర్లు ప్రకటించడం లేదో అర్థం కాక పార్టీ పెద్దల చుట్టు తిరుగుతున్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి విషయానికి వస్తే ఆయనపై వ్యతిరేకత తీవ్రంగా ఉందని పార్టీ వద్ద నివేదికలున్నాయి. ఈ నేపథ్యంలో ద్వారంపూడి స్థానంలో ఆయన భార్యకు టికెట్ ఇస్తే ఎలా ఉంటుందనే దానిపై పార్టీ పరిశీలిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. మరోపక్క కాకినాడ సిటీలో కాపుసామాజికవర్గ ఓట్లు అధికంగా ఉన్న నేపథ్యంలో ఎన్నికల్లో టీడీపీ కూటమి తరపున పవన్‌కళ్యాణ్ ప్రభావం అధికంగా ఉంటుందనే అంచనాతో అదే సామాజికవర్గానికి చెందిన ఓ చోటా మహిళా నేతను నిలబెడితే ఎలా అనేదానిపై బేరీజు వేస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీ తరపున కాకినాడ సిటీ నుంచి నిలబెట్టే అభ్యర్థిని చూసి తర్వాత నిర్ణయం తీసుకోవచ్చనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. పెద్దాపురం సీటు దవులూరి దొరబాబుదే అని ఇదివరకే జగన్ ఓ బహిరంగ సభలో ప్రకటించారు. తీరా ఇంతకాలం అవుతున్నా ఆయన పేరు ఎక్కడా అసెంబ్లీ అభ్యర్థిగా జాబితాలో ఉండడం లేదు. ఇక్కడ దొరబాబుపై తీవ్ర వ్యతిరేకత, క్యాడర్‌తో గొడవలతోపాటు... ఈయన్ను ఎలాగైనా మార్చాల్సిందేనని ఎంపీ అభ్యర్థి సునీల్ పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే తాడేపల్లి పెద్దలు ఈయన్ను పిలిపించి మాట్లాడారు. దీంతో ఈ సీటుపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆఖర్లో ఈయన స్థానంలో మరో బలమైన నేతను బరిలోకి దించుతారా? అనే కోణంలోను చర్చ జరుగుతోంది. కాకినాడ రూరల్, తుని సీట్ల విషయంలో పెద్దగా ఇబ్బందులు లేకపోయినా మిగిలిన సీట్ల కోసం వీటిని ఆపారని తెలుస్తోంది.

పవన్ వస్తే ఎలాగో..

పిఠాపురంస్థానం నుంచి పవన్ కళ్యాణ్ బరిలోకి దిగడం దాదాపు ఖాయమని ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో పవన్‌పై ప్రస్తుత కొత్త ఇన్‌ఛార్జి వంగాగీత బరిలో నిలబడడం అసాధ్యమని పార్టీ భావిస్తోంది. దీనిపై మాట్లాడేందుకే శుక్రవారం సాయంత్రం ఆమె తాడేపల్లి వెళ్లారు. అక్కడ వైసీపీ అధిష్ఠానంతో మంతనాలు జరిపారు. పవన్ ఇక్కడినుంచి పోటీ చేయడం ఖాయమని అధికారికంగా తేలిపోతే గీతను మారుస్తారని సమాచారం. జిల్లాకు చెందిన కాపు ఉద్యమ నేతను పవన్‌పై పోటీకి నిలపాలని యోచిస్తునట్టు తెలిసింది. ప్రస్తుతం వైసీపీ తీరుతో నొచ్చుకుని దూరంగా ఉంటున్న ఈయన్ను బుజ్జగించి అయినా పోటీకి దించుతారనే చర్చ జరుగుతోంది. పవన్‌పై పోటీ చేయడానికి గీత కూడా వెనుకాడుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఇదే విషయాన్ని ఆమె పార్టీ పెద్దలతోను చర్చించినట్లు సమాచారం. పార్టీ పెద్దల ఆలోచన కూడా ఇదే కావడంతో పిఠాపురంపై వైసీపీ అడుగులు ఎలా ఉంటాయనేది సస్పెన్స్‌గా మారింది. ప్రత్తిపాడు, జగ్గంపేట స్థానాల్లో కొత్త ఇన్‌ఛార్జులుగా వరుపుల సుబ్బారావు, తోట నరసింహాన్ని వైసీపీ నియమించింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చేసి వీరిని నియమించినా పెద్దగా ఫలితాలు ఇవ్వడం లేదని తాజాగా పార్టీ సర్వేలో తేలడంతో వైసీపీ పెద్దలు పునరాలోచనలో పడ్డట్లు సమాచారం. పైగా ఇదే విషయాన్ని ఎంపీ అభ్యర్థి సునీల్ పార్టీవద్ద ప్రస్తావించి మార్పులు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ అడు గులు ఎలా ఉంటాయనేది ఆయా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు అర్థం కాక తలపట్టుకుంటున్నారు. ఓటమి పేరుతో మళ్లీ ఎవరిని బలిచేస్తారో తెలియక సతమతమవుతున్నారు. జిల్లాలో ఇంకా టీడీపీ కూటమి ప్రకటించాల్సి ఉన్న మూడు సీట్ల తర్వాతే ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయాలని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

కోడికి వేడి



చనిపోయిన కోళ్లు(ఫైల్‌ఫొటో)

- ఎండలు ముదురుతుండడంతో గుడ్లు తేలేస్తున్న కోళ్లు
- వేసవిలో నిర్వాహకుల్లో గుబులే
- గతేడాది తీవ్ర నష్టాలు
- చలువకు షెడ్లపై ఆకులు వేస్తున్న రైతులు

గండేపల్లి, మార్చి 1: వేసవికాలం ప్రారంభంలోనే బాయిలర్ కోళ్ల వేడికి అప్పుడే కళ్లు తేలయడంతో ఫారం నిర్వాహకుల్లో అప్పుడే గుబులు మొదలైంది. ప్రతిఏటా వేసవిలో కోళ్లఫారాల నిర్వాహకులకు దినదినగండంలా మారుతోంది.

బాయిలర్ కోళ్ల పెంపకానికి 45రోజుల్లో తయారయ్యే కోళ్ల నిర్వాహకులు కంటికి రెప్పలా కాపాడుకుంటారు. వర్షాకాలం, శీతాకాలం అయితే కోళ్ల మరణాలు తక్కువగా ఉండడంతోపాటు దిగుబడులు కూడా రెండు నుంచి మూడు కిలోల చొప్పున లాభాలు వస్తుంటాయని రైతులు చెబుతున్నారు. వేసవి ప్రారంభమైతే చాలు దినదినగండంగా మారి గుబులు మొదలవుతుందంటున్నారు. ఎండల వేడిమి తట్టుకోలేదని ఎప్పటికప్పుడు వాటర్ ఇవ్వడంతోపాటు చలువకు మజ్జిగ పదార్థాలు ఇవ్వాలని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి వస్తోంది. ఒక్కపూట నీరు లేకపోయినా కోళ్ల మృత్యువాత పడే అవకాశం ఉంది. గతేడాది ఫారం నిర్వాహకులు కోళ్లు పిట్టల్లా రాలిపోవడంతో తీవ్రమైన నష్టాలు చవిచూశారు. ఈ ఏడాది అలా జరగకూడదని ఇప్పటినుంచే కోళ్లఫారాలపై రక్షణ చర్యలు చేపట్టారు. రోజూ సాయంత్రం వేళల్లో నీటితో తడుపుతున్నారు. లోపల ఫ్యాన్లు, కూలర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఫారం నిర్వాహకులు కంపెనీల ప్రతి నిధులతో ఒప్పందాలు చేసు కోవడంతో తీరా దిగుబడి లేకపోవడంతో భయాందోళన చెందుతున్నారు. కోడి పెరగడం ప్రారంభంనుంచి చివరి వరకూ కంపెనీ వారే మందులతోపాటు మేత సరఫరా చేస్తారు. కోడి రెండు నుంచి మూడు కిలోలు దిగుబడి వస్తే రూ.ఐదు నుంచి రూ.ఆరు వస్తాయని, వేసవిలో దిగుబడులు తగ్గితే కమీషన్ తీవ్రంగా తగ్గించేస్తారని నిర్వాహకులు చెబుతున్నారు. వేసవిలో వేడికి కోడి పెరగదని, కమీషన్లు కూడా తక్కువగా వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. గండేపల్లి మండల పరిధిలో లక్షా50వేల కోళ్లు ఉన్నాయి. వేసవి తీవ్రత కోళ్ల ఫారాలపై పడుతుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటినుంచే ఎండల బారిన పడకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు.

కాపాడుకోకపోతే నష్టాలు తప్పవు

వేసవిలో కోళ్లఫారం వద్దే తిష్ఠ వేసుకుని ఉండాలి. కోళ్లకు ఎప్పటికప్పుడు చూసుకోవాలి. షెడ్లపై ఆకులు కూడా తడపాల్సి ఉంటుంది. ఇలా చేయకపోతే ఎండల వేడికి కోళ్లు చనిపోతాయి. గతేడాది కోళ్లు చనిపోయి తీవ్రం నష్టం చవిచూశాను. వేసవిలో కంపెనీ వాళ్లు నిర్వాహకులకు వెసులుబాటు ఇవ్వాలి.

-యరమల్ల విష్ణు, కోళ్ల ఫారం నిర్వాహకుడు, మల్లేపల్లి

కోళ్లఫారం పైన చల్లదనం కోసం వేసిన ఆకులు



జిల్లాలో విద్యుత్ నిఘా శాఖ దాడులు

- కరప మండలం గొర్రిపూడిలో ఓ వ్యక్తికి రూ.96,627 అపరాధ రుసుం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1: విద్యుత్ నిఘా శాఖ అధికారులు కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం దాడులు చేసినట్లు విద్యుత్ విజిలెన్స్ రాజమహేంద్రవరం సీఐ కె.నాగమోహన్‌రెడ్డి తెలిపారు. అధికారుల సూచనల మేరకు కాకినాడ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.విష్ణుమూర్తి తాను కలిసి ఈ జిల్లాలో కరప మండలం గొర్రిపూడిలో విద్యుత్ మీటర్ బైపాస్ చేసి చౌర్యం చేస్తున్న వ్యక్తిని గుర్తించి అతడికి రూ.96,627 అపరాధ రుసుము, రూ.7వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో విద్యుత్ నిఘా శాఖ దాడులు చేసి 95 కేసులు నమోదు చేశామని, చౌర్యం చేస్తున్న నిందితుల నుంచి రూ.1,18,000 జరిమానా వసూలు చేశామని సీఐ తెలిపారు.

తొలిరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- హాజరైన 20,389మంది
- నేడు ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పిఠాపురంలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు

కాకినాడ రూరల్, మార్చి 1: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 59 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకూ నిర్వహించిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 21045మంది హాజరు కావాల్సి ఉండగా 20,389మంది హాజరు కాగా 656మంది పరీక్ష రాయలేదని డీఐఈవో నూకరాజు తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 1893మంది హాజరుకావాల్సిఉండగా 1775మంది హాజరుకాగా 118మంది గైర్హాజరయ్యారన్నారు. శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్నాయని డీఐఈవో తెలిపారు. కాకినాడ పీఆర్ జూనియర్ కళాశాల, సీబీఎం, వేళంగి జూనియర్ కళాశాలల పరీక్షా కేంద్రాలను పరిశీలించామన్నారు.

ఏప్రిల్ 25న ఏపీఆర్ఎస్ సీఏటీ-2024

కాకినాడ రూరల్, మార్చి 1: ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్-2024 (ఏపీఆర్ఎస్ సీఏటీ) పరీక్షను ఏప్రిల్ 25న నిర్వహించనున్నట్లు కాకినాడ డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలోని అన్ని సీట్లకు, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు, ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలోని ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్షను 25న కాకినాడలో నిర్వహించనున్నామన్నారు. ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 31 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మైనార్టీ విద్యార్థులకు మాత్రం ప్రవేశ పరీక్ష లేకుండా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వివరాలకోసం 8712625029 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

డిజిటల్ టెక్నాలజీతో ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు విద్యాబోధన: డీఈవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

కాకినాడ రూరల్, మార్చి 1: డిజిటల్ టెక్నాలజీతో ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు విద్యాబోధన చేయాలని డీఈవో పిల్లి రమేష్ సూచించారు. జిల్లాలోని ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయులు, ఐఈఆర్పీలకు, సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సమగ్రశిక్ష సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలోను ప్రత్యేక అవసరాలుగల పిల్లల సమగ్ర సర్వే నిర్వహించి గుర్తించిన వారిని సంబంధిత పాఠశాల, భవిత కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నరసింహం, మహాలక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా కేదారేశ్వరస్వామి కల్యాణం

- కోటిలింగాలకు అభిషేకం నిర్వహించిన యనమల

జగ్గంపేట, మార్చి 1: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో గతనెల 26 నుంచి నిర్వహిస్తున్న కోటి పార్థివలింగ మహారుద్రాభిషేకం నిర్విరామంగా జరుగుతోంది. జ్యోతుల నెహ్రూ, మణి, జ్యోతుల నవీన్, లక్ష్మీ దేవి, తోట సర్వారాయుడు, సునీత దంపతులు కలిసి కేదారేశ్వరస్వామికి శుక్రవారం ఘనంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి శివకేశవ పీఠం సంస్థాపక పీఠాధీశ్వరి శ్రీశ్రీశ్రీ మాతా శావానంద హాజరై విఘ్నేశ్వరపూజ, గోపూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర ఏలేరు నదీతీరాన శివకేశవులు కొలువైన ఈ క్షేత్రంలో మహాసంకల్పం ద్వారా నెహ్రూ కుటుంబానికే కాకుండా వీక్షించిన వారికి, పాల్గొన్న వారికి పుణ్యం వస్తుందన్నారు. మాజీమంత్రి యనమల రామకృష్ణుడు కోటిలింగాలను దర్శించి అభిషేకం చేశారు. వేలాది భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, తోట రవి, మోహనరావు, కోర్పుసాయితేజ, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, కుంచె రాజా, ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఇర్రిపాకలో మాతా శివానందస్వామిని సత్కరిస్తున్న జ్యోతుల కుటుంబసభ్యులు



పూజలు తిలకిస్తున్న యనమల

కార్మికుల సొమ్ము దోచుకున్న జగన్‌రెడ్డి

- కలెక్టరేట్‌వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా



కలెక్టరేట్‌వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కాకినాడ సిటీ, మార్చి 1: భవన నిర్మాణ రంగంలో పనిచేసే 53 రకాల వృత్తులు చేసే 25లక్షల కుటుంబాల కార్మికులకు జగన్‌రెడ్డి ఐదేళ్లనుంచి అన్యాయం చేస్తున్నాడని, కార్మికులు దాచుకున్న సొమ్ము రూ.2,500కోట్లు దోచుకున్న జగన్‌రెడ్డి వైఖరి నశించాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నాచౌక్‌నుంచి ర్యాలీగా కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు, భవన నిర్మాణ కార్మికులు మధ్య తోపులాట జరిగింది. 2019 నుంచి నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణం చెల్లించాలని, సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన 1214 సర్క్యులర్ మెమోను రద్దు చేయాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. మానవత్వం లేకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. ఈ ధర్నాకు కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ మద్దతు తెలుపుతూ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామన్నారు. తెలుగుదేశం-జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు చేర్చాలని సంఘ నాయకులు సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు చింతల సత్యనారాయణ, జీవ, బోరా సత్తిబాబు, చక్రం, చీకట్ల సాంబశివ, సురేష్, చేబ్రోలు వెంకటరమణ, కరణం విశ్వనాథం, నందేశ్వరరావు, చంద్రమళ్ల పద్మ, దారపురెడ్డి క్రాంతి, నక్కెళ్ల శ్రీను, టి.రాజా, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

జీజీహెచ్, ఆర్ఎంసీలకు అడ్మినిస్ట్రేటర్‌గా శ్రీధర్ బాధ్యతలు



జీజీహెచ్(కాకినాడ),మార్చి 1: కాకినాడ జీజీహెచ్, ఆర్ఎంసీలకు సంయుక్త అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ నూకతోటి శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆయన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్‌కు జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. గ్రూప్-2 అధికారిగా డిప్యూటీ తహసీల్దార్‌గా 2007లో బాధ్యతలు చేపట్టిన ఆయన 2009లో తహసీల్దార్‌గా పదోన్నతి పొం దారు. అనంతరం కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఆయన అందించిన సేవలు ప్రభుత్వం గుర్తించింది. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయన్ను కాకినాడ జీజీహెచ్‌కు, రంగరాయ వైద్యకళాశాల సంయుక్త అడ్మినిస్ట్రేటర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీజీహెచ్‌లోని ప్రత్యేక ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌ను మినిస్టీరియల్ సంఘ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కార్యదర్శి పేపకాయల కృష్ణ, శేఖర్, కిషోర్, సాయి, గుత్తుల శ్రీనివాస్‌లతోపాటు వైద్యులు, సిబ్బంది అభినందించారు.

పీఆర్‌లో ఈఎండీపీ ప్రోగ్రాం

కాకినాడ రూరల్, మార్చి 1: కాకినాడ పీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ)ని డీఈవో పి.రమేష్, డీవైఈవో డేనియల్‌రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు రేపటి భావిపారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఉపయోగపడే 21వ శతాబ్దపు నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. పది పాఠశాలలకు చెందిన విద్యార్థులు కాకినాడ జిల్లాస్థాయి ఎక్స్‌పోలో తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. బెండపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమస్థానానికి, సామర్లకోట జడ్పీహెచ్ఎస్ ద్వితీయ స్థానానికి ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీఈవో వెల్లడించి విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు ఇవ్వాలి

- కాకినాడ కలెక్టరేట్‌వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల ధర్నా

8వ పేజీ



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వాహనాన్ని చుట్టుముట్టిన పోలీసులు


ఇంటికి వచ్చిన పోలీసులను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

చర్చ..రచ్చ

అనపర్తిలో 'బహిరంగ చర్చ' రచ్చరచ్చ

మాజీ ఎమ్మెల్యే చర్చ పిలుపునకు స్పందించని ఎమ్మెల్యే

బయటకు వెళ్లకుండా నల్లమిల్లిని అడ్డుకున్న పోలీసులు

పోలీసులకు టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట

అనపర్తి, మార్చి 1: అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఐదేళ్లలో చేసిన రూ.500 కోట్ల అవినీతిపై చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటన, తదనంతర పరిణామాలు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ బహిరంగ చర్చ అంశం రచ్చరచ్చగా మారింది. ఇది శుక్రవారం అనపర్తిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వర్గీయులు, రామవరంలో రామకృష్ణారెడ్డి వర్గీయుల బలప్రదర్శనగా సాగింది. ఇటీవల నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అవినీతిపై ముద్రించిన కరపత్రం సూర్యనారాయణకు చెందిన గంగిరెడ్డి నర్సింగ్ హోంలోని సిబ్బందికి స్వయంగా అందజేశారు. ఇది వివాదాస్పదంగా మారింది. తాను లేనపుడు ఆసుపత్రికి రావడం కాదని.. దమ్ముంటే ముందుగా సమయం చెప్పి రావాలంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలతో వివాదం మరింత పెరిగింది. దీనికి స్పందించిన నల్లమిల్లి మార్చి 1వ తేదీ ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే ఇంటికి అవినీతిపై చర్చించేందుకు వస్తానని ప్రకటించారు. దీంతో బహిరంగ చర్చ అంశం తెరమీదకు వచ్చింది. నల్లమిల్లి చేసిన ప్రకటనకు నాలుగు రోజులు గడిచినా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి స్పందన లేదు. అయినప్పటికీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బహిరంగ చర్చకు వచ్చేందుకు సిద్ధపడడంతో గురువారం రాత్రి నుంచే పోలీసు బలగాలు నల్లమిల్లి ఇంటికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం అనపర్తిలో ఎమ్మెల్యే నివాసానికి వైసీపీ శ్రేణులు, రామవరంలో నల్లమిల్లి నివాసానికి టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకున్నాయి. 10:30 ప్రాంతంలో అనపర్తిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తన అనుచరులతో ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలుసుకున్న రామకృష్ణారెడ్డి అనపర్తి వెళ్లేందుకు పయనం కావడంతో పోలీసులు ఇంటిలోకి చొరబడి ఆయనను గృహ నిర్బంధం చేసేందుకు ప్రయత్నించారు. చివరకు పోలీసులను దాటుకుని అనపర్తి-పెడపర్తి రోడ్డుపైకి చేరుకున్న నల్లమిల్లిని పోలీసులు అడ్డు కున్నారు. వాహనంపై వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అక్కడి నుంచి కదలనివ్వకపోవడంతో ఆయన వాహనం దిగి రోడ్డుపై బైఠాయించి సుమారు గంటన్నర పాటు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు వాహనం ఎక్కించుకుని అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. కొందరు నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై పడుకుని నిరసన తెలపడంతో పోలీసులు వారిని వాహ నానికి అడ్డు తొలగించి నల్లమిల్లిని అక్కడి నుంచి తరలించారు. నల్లమిల్లిని తరలిస్తున్న పోలీసు వాహనాన్ని టీడీపీ నాయకులకు చెం దిన కార్లు, బైకులు వెంబడించాయి. రామవరం నుంచి కొవ్వూరు తరలించడం ఆఖరికి ఏ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లకుండా రోడ్లపైనే తిప్పడంతో కొవ్వూరు టోల్‌ప్లాజా వద్ద టీడీపీ నాయకులు పోలీసు వాహనాన్ని అడ్డుకుని ఆందోళన చేయడంతో మూడున్నర గంటల హైడ్రామా తర్వాత నల్లమిల్లిని అదే వాహనంలో ఇంటికి తీసుకొచ్చి వదిలిపెట్టారు. ఇంటికి చేరుకున్న నల్లమిల్లికి ఆయన సతీమణి మహాలక్ష్మి హారతిచ్చారు.

బహిరంగ చర్చ చేసే ధైర్యం లేకే..

అవినీతిపై తన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని పలాయనం చిత్తగించారని రామకృష్ణారెడ్డి విమర్శించారు. పదేళ్లుగా తనపై అవే ఆరోపణలు చేస్తున్నారని, సదరు ఆరోపణలపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించారని, నేటికీ నివేదిక బయటకు ఎందుకు రాలేదన్నారు. అవినీతి జరిగి ఉంటే అధికారంలో ఉండి కూడా తనను ఎందుకు వదలిపెట్టారని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేసిన అవినీతిని ఆధారాలతో సహా నిరూపించేందుకు సిద్ధమని చెప్పినా ఆయన చర్చకు ఎందుకు రావడంలేదో ప్రజలకు అర్థమయిందన్నారు. రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేల్లో అవినీతికి పాల్పడని ఎమ్మెల్యే తానేనని చెప్పుకునే సూర్యనారాయణరెడ్డికి నీతిపరుడని నిరూపించుకునే చర్చలో పాల్గొనడానికి భయమెందుకని ఎద్దేవా చేశారు.

నల్లమిల్లి అనుచరుల నిరసన



వైసీపీ నాయకుల ర్యాలీ

ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక గంగి రెడ్డి నర్సింగ్ హోమ్ నుంచి దేవీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అవినీతిపై ముందు చర్చ జర గాలని డిమాండ్ చేశారు. తాను అవి నీతికి పాల్పడినట్టు రుజువు చేయ గలిగితే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు.

కొవ్వూరులో ఉద్రిక్తత

కొవ్వూరుకు రామకృష్ణారెడ్డి.. తెలుగు తమ్ముళ్ల ఆందోళన

గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద పోలీసు వాహనాన్ని అడ్డుకున్న నాయకులు

ఎందుకు తిప్పుతున్నారని డీఎస్పీని నిలదీసిన నేతలు

కొవ్వూరు, మార్చి 1 : అనపర్తి సంఘటన కొవ్వూరును కూడా తాకింది. అవినీతిపై గళమెత్తిన టీడీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేసి రోడ్లపై కారులో తిప్పడం ఈ అరాచక ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ఎన్నికల వేళ తాజాగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం అనపర్తిలో అదుపులోకి తీసుకుని సుమారు రెండు గంటలపాటు కారులో తిప్పుతూ చివరకు కొవ్వూరుకు తీసుకువచ్చారు. కొవ్వూరులో ఏ పోలీస్టేషన్‌లో ఉంచుతారోనని పోలీసులు, నాయకులు అంతా అప్రమత్తమయ్యారు. అయితే మధ్యలో ఏం జరిగిందో ఏమోగాని పోలీసులు రాజమహేంద్రవరం గామన్‌బ్రిడ్జిపై నుంచి కొవ్వూరు మీదుగా పంగిడి వైపు వెళ్లిపోయారు. కొంతదూరం వెళ్లిన తరువాత అక్కడ నుంచి వెనుదిరిగి వస్తుండగా గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. తమ నాయకుడిని ఎందుకు అరెస్టుచేశారు, ఎక్కడికి తీసుకువెళ్తున్నారు, కారులో ఎందుకు తిప్పుతున్నారని డీఎస్పీని ప్రశ్నించారు. దీనికి డీఎస్పీ కేసు ఏం లేదని, ఇంటికి తీసుకువెళ్లి దింపుతామని చెప్పడంతో అయితే తన వాహనంలో తీసుకువెళ్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ పట్టుపట్టారు. రామకృష్ణారెడ్డి పోలీసు కస్టడీలో ఉన్నందున తామే ఇంటివద్ద అప్పజెబుతామని డీఎస్పీ చెప్పారు. అయినా జవహర్ వినకుండా రామకృష్ణారెడ్డిని తరలిస్తున్న పోలీసు వాహనంలో ఎక్కి తానూ వస్తానంటూ పట్టుబట్టారు. ఈ సందర్భంగా కొవ్వూరు టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి మాట్లాడుతూ అనపర్తి ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే రూ.500 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, దానిని నిరూపిస్తానని బయలుదేరిన రామకృష్ణారెడ్డిని ఏం జరిగిందని ఆలోచన చేయకుండా, మాజీ ఎమ్మెల్యే అని చూడకుండా అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం అదే వాహనంలో రామకృష్ణారెడ్డిని అనపర్తి తరలించారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాస్, కాగిత రఘు, బూరుగుపల్లి వీర రాఘవులు, కొత్తపల్లి ఆశిష్‌లాల్, జి.జి. చలం, వేమగిరి వెంకట్రావు, యనమదల శివరామకృష్ణ, కాకర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద పోలీసులను ప్రశ్నిస్తున్న నేతలు

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇద్దరికి కాంస్య పతకాలు

'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి 1: తమ విద్యార్థినులు అఖిల భారత, ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రెండు కాంస్య పతకాలను సాధించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. వర్సిటీలో శుక్రవారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలైన డీఆర్‌కే రెడ్డి వ్యాయామ విద్య కళాశాల (గొల్లలమామిడాడ)లో డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బైరెడ్డి రాజేశ్వరి అఖిల భారత వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 45 కిలోల కేటగిరిలోనూ, ఖేలో ఇండియా పోటీల్లో 49 కిలోల కేటగిరిలో బైరెడ్డి చంద్రిక కాంస్య పతకాలను సాధించారన్నారు. వీరిద్దరూ భవిష్యత్‌లో మరిన్ని పతకాలు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, క్రీడా బోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, పీడీ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

షార్ కాంట్రాక్టర్ ఆత్మహత్య



సూళ్లూరుపేట, మార్చి 1: సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న షార్ కాంట్రాక్టర్ వి.నాగేశ్వరరావు (55) శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల సమచారం మేరకు... రాజమహేంద్రవరానికి చెందిన నాగేశ్వరరావు గత 20 సంవత్సరాల నుంచి షార్‌లో అనసూయ ఇంజినీరింగ్ వర్క్స్ పేరుతో స్ట్రక్చరల్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నారు. బాలాజీ నగర్‌లోని సొంత ఇంట్లో తన వద్ద పనిచేస్తున్న వర్కర్స్ ఉంటుండగా ఆయన బాపూజీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఇటీవలే ఇంటిని కూడా అమ్మేసినట్లు తెలిసింది. శుక్రవారం అమ్మిన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆయన బాలాజీ నగర్‌లో ఉన్న తన సొంత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సిబ్బంది నాగేశ్వరరావు ఉరేసుకొని మృతి చెంది ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆయన భార్యకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి భార్యను వివరాలడిగి తెలుసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

3 జిల్లాల్లో 2,550 మంది గైర్హాజరు

పలు చోట్ల అసౌకర్యాలతో విద్యార్థుల ఇక్కట్లు


రాజమహేంద్రవరం: పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున మొదటి ఏడాది తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్ష కావడంతో విద్యార్థులు కాస్త టెన్షన్ ఫ్రీగా కనిపించారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. గంట ముందుగానే చాలా మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత గదుల్లోకి అనుమతించారు. తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో జనరల్ విభాగంలో 52,277 మంది విద్యార్థులకు 50,411 మంది.. ఒకేషనల్‌లో 6,889కి 6,205 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మూడు జిల్లాల్లో కలిపి మొత్తం 2,550 మంది గైర్హాజరయ్యారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సమయానికి బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలను ఆశ్రయించి పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఉరుకులు పరుగులు తప్పలేదు. ప్రైవేటు కళాశాలలు విద్యార్థులు కళాశాలకు వస్తే అక్కడి నుంచి పరీక్ష కేంద్రానికి.. పరీక్ష ముగిసిన తర్వాత కళాశాలకు బస్సు సదుపాయం కల్పించకపోవడంతో విద్యార్థులకు ఇళ్లకు వెళ్లడానికి అవస్థలు తప్పలేదు. కొన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు పని చేయకపోవడంతో మూడు గంటల పాటు పరీక్ష రాసే క్రమంలో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. అయితే, కిటికీలు తెరుచుకోవాలని అభ్యర్థులకు సిబ్బంది సలహా ఇచ్చారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకొచ్చిన తల్లిదండ్రులు చాలా మంది వేచి చూడడానికి నీడ దొరక్క ఇబ్బంది పడ్డారు. మూడు గంటల పాటు వేచి ఉండే క్రమంలో ఎండ వేడిమికి ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్రంగా అసౌకర్యానికి గురయ్యారు. తాగునీరు, మరుగుదొడ్లు సమస్యగా మారాయి. తూర్పుగోదావరి జిల్లాలో జనరల్ విభాగంలో 19,737 మందికి 19,309.. ఒకేషనల్ విభాగంలో 2,001కి 1,851 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో జనరల్ 21,045 మందికి 20,389.. ఒకేషనల్ 1,893కి 1,775.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనరల్ విభాగంలో 11,495 మంది విద్యార్థులకు 10,713.. ఒకేషనల్ విభాగంలో 2,995కి 2,579 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు పేర్కొన్నారు. కాగా.. శనివారం(2వ తేదీన) రెండో ఏడాది జనరల్ విద్యార్థులకు ద్వితీయ భాష, ఒకేషనల్‌కి జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షలు జరుగుతాయి.


రాజమహేంద్రవరంలో ఓ పరీక్ష కేంద్రం వద్ద సందడి..

పంచాయతీల అభివృద్ధికి నిధులివ్వాలి

కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల ధర్నా

సర్పంచ్‌లు, పోలీసుల మధ్య తోపులాట.. ఉద్రిక్తత..


సర్పంచ్‌లను నిలువరిస్తున్న పోలీసులు

కాకినాడ సిటీ, మార్చి 1: తమ న్యాయమైన 16 డిమాండ్లను పరిష్కరించాలని, పంచాయతీల అభివృద్ధికి నిధులు, అధికారాలను తక్షణమే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అండ్ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సర్పంచ్‌లు చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. సర్పంచ్‌లను కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకుని లోపలికి వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సర్పంచ్‌లకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అప్పటికే జనసేన-టీడీపీకి చెందిన నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. సర్పంచ్‌లను లోపలికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరును, ప్రభుత్వతీరును నిరసిస్తూ సర్పంచ్‌లు నినాదాలతో హోరెత్తించారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రోడ్లు, కాలువలు, తాగునీరు, వీధి దీపాలు వంటివి ప్రజలకు సమకూర్చలేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన వాటా నిధులు ఇవ్వకపోగా ఇతర ఆదాయం ద్వారా వచ్చే నిధులను, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పంపిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వేల కోట్ల రూపాయలను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించి సొంత పథకాలకు వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లను ప్రవేశపెట్టి పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల హక్కులు, అధికారాలను హరించివేశారన్నారు. అనంతరం కలెక్టర్‌కు పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌ల నిరసన ధర్నాకు జనసేన పీఏసీ సభ్యులు పంతం నానాజీ సంఘీభావం తెలిపారు. టీడీపీ కాకినాడ రూరల్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, రామదేవు సీతయ్యదొర, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వినోద్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి జల్లి బాలరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చుక్క ధనుంజయ యాదవ్, తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శాంతకుమారి, రంబాల రమేష్‌కుమార్, నాయకులు ప్రభాత్, నందమూరి రాజు, చిక్కం దొరబాబు, పెద్దరెడ్డి రాము పాల్గొన్నారు.

9న ప్రత్తిపాడుకు చంద్రబాబు

ప్రత్తిపాడు, మార్చి 1: తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మార్చి 9వ తేదీన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు రానున్నారు. ప్రజాగళం పేరుతో నిర్వహించే భారీ బహిరంగ సభ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పర్యటన ఖరారు అయినట్లు నియోజకవర్గ ఇంచార్జ్ వరుపుల సత్యప్రభ శుక్రవారం తెలిపారు. సమావేశానికి సత్యప్రభ స్థల పరిశీలన చేశారు. నరేంద్ర గిరి కొండ పరిసర ప్రాంతాలను, రాచపల్లి గ్రామ పొలిమేరలో స్థలాలను పరిశీలించారు. రెండు మూడు చోట్ల స్థలాలను చూసినా వాటిని ఇంకా ఆమోదించలేదని. శనివారం స్థల పరిశీలన ఒక కొలిక్కి వచ్చి ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.సూర్యనారాయణరాజు, బి.గోపిరాజు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్ స్కీం' పనులపై వడివడిగా అడుగులు

అన్నవరం, మార్చి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడంతో దీనికి సంబంధించిన పనులు వడివడిగా జరుగుతున్నాయి. అన్నవరం దేవస్థానంలో ఈ పనులను ప్రధాని మోదీ ఈనెల 7న వర్చువల్‌గా ప్రారంభిస్తారనే సమాచారంతో శుక్రవారం టూరిజం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజారావు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసి కొలతలు తీసుకున్నారు. రూ 20 కోట్లతో ప్రధానంగా అన్నదాన భవనం, అన్నప్రసాదం స్వీకరించే భక్తుల కోసం క్యూకాంప్లెక్స్ నిర్మించి ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని ఆలోచన చేస్తున్నారు. ప్రధాని మోదీ వర్చువల్ ప్రారంభం అనంతరం కేంద్ర కమిటీ అన్నవరం సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి నిర్మాణ స్థలాలను ప్రత్యక్షంగా పరిశీలించి టెండర్లు పిలవనున్నారు. ఈ పనులను దేవస్థానానికి సంబంధం లేకుండా టెండర్ ప్రక్రియ, నిర్మాణం అంతా టూరిజం పర్యవేక్షణలోనే జరగనున్నాయి. ఈ సందర్భంగా టూరిజం అధికారులు దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్, చైర్మన్ రోహిత్‌లతో సమావేశమయ్యారు. దేవస్థానం ఈఈ మురళీ, డిప్యూటీ ఇంజనీర్ బి.ఎస్ రాంబాబు తదితరులున్నారు.

రత్నగిరిపై అల్లరి నరేష్ పూజలు


వేదాశీర్వచనం అందుకుంటున్న అల్లరి నరేష్

అన్నవరం, మార్చి 1: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం సినీ నటుడు అల్లరి నరేష్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఏపీఆర్వో గణపతి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు భక్తులు ఆసక్తి కనబర్చారు.

తలుపులమ్మను దర్శించుకున్న అల్లరి నరేష్

తుని రూరల్, మార్చి 1: తలుపులమ్మ లోవలో అమ్మవారిని శుక్రవారం సినీ నటుడు అల్లరి నరేష్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హత్యాయత్నం కేసులో అరెస్టు

అమలాపురం టౌన్, మార్చి 1: గత నెల 28వ తేదీన ఈదరపల్లిలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడైన ఎంపీటీసీ అడపా సతీష్ అలియాస్ సత్తిబాబును అరెస్టు చేసినట్టు అమలాపురం పట్టణ సీఐ కె.కిస్టఫర్ తెలిపారు. సత్తిబాబు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో అతని ఇంటి ఎదురుగా అద్దెకు ఉంటున్న కొత్తపల్లి సుబ్రహ్మణ్యం(48) పై పదునైన కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన సుబ్రహ్మణ్యం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సత్తిబాబును అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండు విధించారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

షాపు దగ్ధం: రూ.20 లక్షల నష్టం



రాజోలు, మార్చి 1: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలులో శ్రీఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న కనకం ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్ షాపులో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. అగ్నిప్రమాదం జరిగి రూ.20 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని రాజోలు అగ్నిమాపక అధికారి బాలకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. షాపు యజమాని గ్రంధి నాగవెంకటసుబ్బారావు మధ్యాహ్నం సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లగా షాపులో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. రాజోలు అగ్నిమాపక వాహనానికి డ్రైవరు లేకపోవడంతో పాలకొల్లు అగ్నిమాపక కేంద్రం నుంచి నగరం ఓఎన్జీసీ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పాలకొల్లు, నగరం నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. రాజోలు అగ్నిమాపక కేంద్రం నుంచి సరైన సమయంలో అగ్నిమాపక వాహనం వచ్చి ఉంటే ఆస్తి నష్టం తగ్గేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అగ్నిమాపక కేంద్రానికి డ్రైవరు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. సంఘటనా స్థలానికి జిల్లా అధికారి ఎస్.పార్థసారథి, రాజోలు ఎస్ఐ జి.పృథ్వీ వచ్చి పరిశీలించారు.

జీఎస్టీ ఎగవేతపై తనిఖీలు


ఎస్పీ సుబ్బారెడ్డి తనిఖీలు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీఎస్టీ చెల్లించకుండా ఎగవేసినా, హోటళ్లు తదితర వ్యాపారులు వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వాడినా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని రాజ్‌గురు స్పేర్స్‌లో తనిఖీలు చేశామన్నారు. నాలుగు ప్రదేశాల్లో రూ.1,52,41,352 విలువ చేసే 10,805 వస్తువులకు సంబంధించి స్టాక్ వెరిఫికేషన్ చేశామన్నారు. స్టాక్, కొనుగోలు, విక్రయ రిజిస్టర్లు నిర్వహించకపోవడం గుర్తించామని చెప్పారు. కొన్ని వస్తువులకు సంబంధించి వినియోగదారులు, తయారీదారుల వివరాలు, తప్పనిసరి డిక్లరేషన్ లేకపోవడంతో 5 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే నిడదవోలు మండలంలోని గోపవరంలో టీ-కేఫ్ హోటల్‌లో తనిఖీలు చేయగా వాణిజ్య అవసరాలకు వాడుతున్న 5 గృహ వినియోగ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏవో భార్గవ మహేశ్, లక్ష్మీనారాయణ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

కొత్తపల్లి, మార్చి 1: కొత్తపల్లి సురక్ష ప్యాలెస్ కన్వెన్షన్‌హాలులో శనివారం ఉచిత నేత్ర వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు నేత్ర పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

రేపు పల్స్‌పోలియో కార్యక్రమం

కరప, మార్చి 1: ఈనెల 3వ తేదీన నిర్వహించే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాకినాడ డివిజనల్ వైద్యాధికారి రమావత్ శ్రీనివాసనాయక్ సూచించారు. కరప పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యఆరోగ్యశాఖ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు విధిగా రెండు చుక్కల పోలియో డ్రాప్స్ ఇవ్వాలన్నారు. కరప పీహెచ్‌సీ పరిధిలో 9,959 గృహాలుండగా 3,992మంది ఐదేళ్ల లోపు చిన్నారులను గుర్తించామన్నారు. అలాగే వేళంగి పీహెచ్‌సీ పరిధిలో 2,796మంది చిన్నారులను గుర్తించామన్నారు. ఈ చిన్నారులందరికీ 3వ తేదీన బూత్‌లలోను, మిగిలిన వారికి 4, 5 తేదీల్లో ఇంటింటా తిరిగి పోలియో డ్రాప్స్ వేయాలన్నారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యురాలు ఎంకే సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలో ఈనెల 3,4 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.పవన్‌కుమార్ తెలిపారు. రాచపల్లిలో 5 ఏళ్లలోపు వయస్సు గల 3263 మంది పిల్లలకు, పెద్దిపాలెం పీహెచ్‌సీ పరిధిలో 1625మందికి, శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ పరిధిలో 2241 మందికి పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, 63 కేంద్రాల్లో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు.

గండేపల్లి: గండేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లోని అప్పుడే పుట్టిన, ఐదేళ్లలోపు పిల్లలందరికీ 26 పోలియో బూత్‌ల్లో పోలియో చుక్కలు వేస్తామని పీహెచ్‌సీ వైద్యాధికారి కెవి.నరేష్ తెలిపారు. ఈనెల 4,5వతేదీల్లో ఆరోగ్య సిబ్బంది ఇం టింటికి తిరిగి మిగిలిన పిల్లలకు చుక్కలు వేస్తారని, తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలన్నారు.

4న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, మార్చి 1: కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈనెల 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారన్నారు. ఆయా ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76333 నెంబర్‌లో సంప్రదించాలని పీడీ తెలిపారు.

సిమెంట్, స్టీల్ భద్రపరిచిన గోదాముల పరిశీలన

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 1: జిల్లాలోని సిమెంట్, స్టీల్, ఇతర గృహనిర్మాణ సామాగ్రి భద్రపరిచిన గృహనిర్మాణ సంస్థకు సంబంధించిన గోదాములను క్షేత్రస్థాయిలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. కాకినాడ రమణయ్యపేటలో రూరల్ గోదాము, పట్టణ గోదామును తనిఖీ చేసి రికార్డు పరిశీలన చేసి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సకాలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు ఆలస్యం లేకుండా గృహనిర్మాణ సామాగ్రిని విడుదల చేయాల్సిందిగా ఆదేశించారు. గృహనిర్మాణ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్లు ఉన్నారు.

ఓఎన్జీసీ పైప్‌లైన్ పనులు అడ్డుకున్న మత్స్యకారులు

కాకినాడ సిటీ, మార్చి 1: కాకినాడ పోర్టు ఏరియాలో ఓఎన్జీసీ పైప్‌లైన్ పనులను శుక్రవారం మత్స్యకారులు అడ్డుకున్నారు. తాళ్లరేవు, భైరవపాలెం, ఇతర మత్స్యకార ప్రాంతాలకు ఇస్తున్న విధంగానే తమకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పోర్టు ఏరియాకు వెళ్లి మత్స్యకారుల ఆందోళనకు మద్దతు తెలిపి మాట్లాడుతూ సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని 2009లో ఉద్యమం చేయగా కాకినాడ చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధించిన మత్స్యకార కుటుంబాలకు ఓఎన్జీసీ అందించే నష్టపరిహారంలో అన్యాయం జరిగిందన్నారు. 2రోజుల్లో ఓఎన్జీసీ అధికారులను, పోర్టు అధికారులను కలిసి వినతి అందజేస్తామన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీపాల్గొన్నారు.

ఎస్.పైడిపాలలో గిరిజనుల ఆందోళన

రౌతులపూడి, మార్చి 1: గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీ స్థలాలను అక్రమించుకుంటున్నారంటూ ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన గిరిజనులు చింతా రాజమ్మ, మసరా నూకాలమ్మ, పోలోజు పెంటమ్మ సచివాలయం వద్ద ఆందోళ చేశారు. సర్వే నెంబర్ 67-2లో ప్లాంట్ నెంబర్ 65, 66, 101లో ఇళ్ల స్థలాలు కేటాయించి రెండేళ్ల క్రితం పట్టాలిచ్చారు. ఆ స్థలాల్లో వేరే వ్యక్తులు శనివారం మట్టితో కప్పెడుతున్నారని ప్రశ్నించగా ఈ స్థలాలు మాకు ఇచ్చారని దురుసుగా సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేయాడానికి తహశీల్దార్ కార్యాలయం, సచివాలయానికి టీడీపీ నేతలు గొల్లు పెద్దదివాణం, ఎస్టీ నాయకులు ఈగల సత్తిబాబుతో కలిసి వెళ్లగా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సచివాలయం వద్ద న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు.జిల్లా కలెక్టర్ స్పందించి గిరిజనులకు అన్యాయం చేయాలని కోరారు.

పన్ను చెల్లింపుదారులకు శుభవార్త

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 1: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2023-24 వరకు పేరుకుపోయిన పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ ప్రకటించి ఊరట కల్పించింది. పన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ గురువారం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి యజమానులందరూ ఆస్తిపన్నుపై అరియర్ బకాయిలతో సహా ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చి వరకుగల బకాయిలు మొత్తం ఈనెల 31వతేదీకి చెల్లించాలని వడ్డీ మాఫీ పొందడానికి అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఆదిత్య'కు న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు

గండేపల్లి, మార్చి 1: మండలంలో సూరంపాలెం ఆదిత్య క్యాంపు ఆఫీసు నందు గల ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు లభించినట్టు కళాశాల వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి తెలిపారు. నేషనల్ అసైన్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ వారు తమ కళాశాలలో ల్యాబరేటరీ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది మౌలిక సదుపాయాలు, తదితర అంశాలను పరిశీలించి త్రిసభ్య బృందం సిఫారసు మేరకు తమ కళాశాలకు 3.51 స్కోర్‌తో న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు లభించినట్టు తెలిపారు. క్యాంప్ ఆఫీస్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి రమేష్, రవికుమార్ పాల్గొన్నారు.

'అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం'

తునిరూరల్, మార్చి 1: అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి తునిలోని వీరవరపుపేట, ఎస్అన్నవరం గ్రామంలో పర్యటించారు. టీడీపీ,జనసేన ప్రభుత్వంతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, రానున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల మద్దతు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, జిల్లా టీడీపి ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, తుని పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి నాగసోమరాజు, జక్కాన రాయునాయిడు తదితరులున్నారు.

'యువతకు అల్లూరి ఆశయాలు ఆదర్శం'

కోటనందూరు, మార్చి 1: యువత అల్లూరి సీతారామరాజు ఆశయాలను ఆదర్శవంతంగా తీసుకోవాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజు సంఘం వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు అన్నారు. శుక్రవారం ఇందుగపల్లి రెవిన్యూ గొంపకొండవద్ద అల్లూరి ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతిచోట అల్లూరి విగ్రహలను ఏర్పాటు చేసి యువతకు ఆదర్శవంతగా నిలువాలన్నారు. గొంపకొండపైన అల్లూరి పార్కును త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి రమణమ్మ, పచ్చారు దేవుళ్లు, రెడ్డిబుల్లిబ్బాయి, మళ్ల నాగేశ్వరరావు, సుర్లశ్రీనివాస్‌రావు, రాంబల్లి వెంకటరమణ ఉన్నారు.

'వివక్షత చూపుతున్న నాయకులు, అధికారులు'

తాళ్లరేవు, మార్చి 1: జార్జీపేట దళిత ఎంపీటీసీ మందపల్లి నాగమ్మపై అధికార పార్టీ నాయకులు, అధికారులు వివక్షతను చూపుతున్నారని శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జార్జీపేట గ్రామంలో సుమారు నెల రోజుల నుంచి డ్రైనేజీపై సిమెంటు బల్లలు పోయి స్కూలుపిల్లలు డ్రైనేజీలో పడి గాయాలపాలతున్నారని చెప్పినా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి పట్టించుకోవడంలేదన్నారు. సర్పంచ్ ఉప ఎన్నిక దగ్గర నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు నాకు సమాచారం చెప్పకుండా వివక్షతకు గురిచేస్తున్నారని, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో వైసీపీ నేత మందలపల్లి రాంబాబు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారి 111, కిక్, ఊరు పేరు భైరవకోన

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారి 111, కిక్, ఊరు పేరు భైరవకోన

తిరుమల	: అంబాజీపేట మ్యారేజిబ్యాండు
లక్ష్మి	: ఆపరేషన్ వాలెంటైన్
సీ అండ్‌సీ1	: హనుమాన్
సీ అండ్‌సీ2	: ఆపరేషన్ వాలెంటైన్
శ్రీప్రియ	: సుందరంమాస్టర్
పద్మప్రియ	: ఆపరేషన్ వాలెంటైన్
సత్యగౌరి	: భూతద్దం భాస్కర్
సూర్య 1	: ఆపరేషన్ వాలెంటైన్
సూర్య 2	: కిక్

అమరవీరులకు నివాళి

ఏలేశ్వరం, మార్చి 1: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. శుక్రవారం ఏలేశ్వరంలోని పెద్దవీధిలో బాబూ జగజ్జీవన్‌రావు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అనంతారపు రాజు, కాకాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరుల త్యాగాలకు యావత్ జాతి మర్చిపోదని, వారి ఆశయాలను కొనసాగించాలని, ఎస్సీ వర్గీకరణ సాధించి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లు


పిఠాపురంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


ఏలేశ్వరంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

పిఠాపురం, మార్చి 1: పిఠాపురంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని 4 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలురాసారు. ఉదయం పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందడి కనిపించింది. పలుచోట్ల పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఉరుకులు, పరుగులు పెడుతూ రావడం కనిపించింది. కేంద్రాల వద్ద సీఆర్‌పీసీ 144వ సెక్షన్ కింద నిషేదాజ్ఞలు విధించారు. తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలకు ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్ర ంలో 334మందికి 330, హనుమంతరాయ జూనియర్‌కళాశాలలో 273మందికి 260మంది, సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో 231 మందికి 226మంది, అంజనా జూనియర్ కళాశాలలో 199మందికి 191మంది పరీక్షకు హాజరయ్యారు. పట్టణంలోని కేంద్రాల్లో 30మంది విద్యార్థులు తొలిరోజు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

కరప: మండలంలోని వేళంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు 26మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరిండెంట్ ఎం.శ్రీనివాసరావు, డిపార్టమెంటల్ ఆఫీసర్ వి.బాలకృష్ణ తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద పీహెచ్‌సీ వైద్యురాలు ఎంకే సౌజన్య వైద్య సిబ్బందితో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ, ఏఎస్ఐ వి.సూరిబాబులు సిబ్బందితో కలిసి కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

సామర్లకోట: సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల పరీక్షా కేంద్రంగా సామర్లకోటలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలతో పాటు పెద్దాపురం ప్రైవేట్ కళాశాలలకు చెంది 620 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు పరీక్షాకేంద్రంలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జగదీశ్వరరావు పర్యవేక్షణలో డీవోలు శ్రీనివాసరావు, శోభన్‌బాబులు అన్ని తరగతులను పరిశీలించారు. మొదటిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం సంస్కృతం పరీక్షకు 620 మందికి 597 మంది హాజరయ్యారు.

ఏలేశ్వరం: ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షల్లో జూనియర్ కళాశాలో 368 మందికి 351మంది, గురుకుల కళాశాలలో 345మందికి 333 మంది హాజరైనట్టు చీఫ్ సూపర్‌డెంట్‌లు బాబ్జి, జయలక్ష్మీ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పి.రామకృష్ణ, ఎ.ప్రతాప్ తెలిపారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మినర్వా కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్ మెదటి సంవత్సరం పరీక్షలు ప్రారభమయ్యాయి. మెదటిరోజు తెలుగు, సంస్కృతం సంబంధించి 479 మందికి 13 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెంట్ ఆనంద్ జోష్ తెలిపారు.

కోటనందూరు: మదర్ విద్యాసంస్థల్లో 251మంది పరీక్షలు రాయల్సిఉండగా 229మంది హాజరయ్యారు. శ్రీసాయిజూనియర్‌కళాశాల్లో 158 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 141మంది పరీక్షకు హాజరయ్యారు.

రౌతులపూడి: ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ కళాశాల నందు ఇంటర్ పరీక్షలు జరిగాయి. 242 మందికి గానూ 226 మంది హాజరయ్యారు. సీఎస్ వనుం జోగిరాజు పరిక్షా కేంద్రాన్ని పర్యవేక్షించారు.

రజకుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

రజక భరోసా బాట సమావేశంలో నేతలు రామారావు, కొండబాబు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన రామారావు, కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 1: రజకుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ కాకినాడ జిల్లా రజక సాధికార సమితి కన్వీనర్ ఏడీపీ మెంటారావు అధ్యక్షతన టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రజక భరోసా బాట సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామారావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీ కులాలకు ఆదరణ పథకం కింద కులవృత్తులు చేసుకునే వర్గాల వారికి సామగ్రి పనిముట్లు, రజకులకు వాషింగ్ మెషీన్లు, ఐరన్ బాక్సులు సబ్సిడీపై అందించి వారిని ఆదుకుంటామన్నారు. కొండబాబు మాట్లాడుతూ చంద్రబాబు బీసీ వర్గాలను రాజకీయ రంగంతోపాటు అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లారన్నారు. రజక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గుర్రపసాల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, పార్టీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, తాతపూడి రామకృష్ణ, పెరిక కన్వీనర్ వనపర్తి బద్రి ప్రసంగించారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, కొల్లాబత్తుల అప్పారావు, వొమ్మి బాలాజీ, పొంగా బుజ్జి ముగ్గళ్ల బాబూరావు, గొలితు సత్యనా రాయణ, నరం శ్రీనివాసరావు, అనకాపల్లి గణేశ్వరరావు, సీల అప్పలరాజు, చోడవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.


తేటగుంటలో కార్యకర్తలతో యనమల రామకృష్ణుడు

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మాజీ మంత్రి యనమల

తునిరూరల్, మార్చి 1: సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంటలోని యనమల నివాసంలో కార్యకర్తలతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరాతీసి కార్యకర్తలకి పలు సూచనలిచ్చారు. పెద్దఎత్తున పార్టీలో చేరుతున్నవారిని కలుపుకుంటూ రానున్న ఎన్నికల్లో తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్యను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొల్లపల్లి రాంబాబు, పేరురి కిషోర్, గొల్లపల్లి నూకరాజు, పేరురి కృష్ణ, కోనా కన్నారావు, గూటూరి తాతీయులు తదితరలున్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు సమక్షంలో తునిలో శుక్రవారం తుని 22వవార్డుకు చెందిన ఎమ్.మాతయ్య, రాజు, వెంకటేష్, నందమూరి దొరబాబు, కీర్తి నవీన్, సానాపల్లి మణికంఠ, జోగారావు తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ తుని పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, మళ్ల గణేష్, కడియం శ్రీను, కొండబాబు, షేక్ వల్లీ, సిద్దాంతపు సత్తిబాబు తదితరులున్నారు.

చంద్రబాబు సీఎం కావడం అవసరం

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప


పెద్దాపురంలో ప్రచారం చేపడుతున్న రాజప్ప


పెద్దాపురం, మార్చి 1: చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చారిత్రాత్మక అవసరం అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండల పరిధిలోని జి.రాగంపేట, పట్టణంలోని 9, 11 వార్డుల్లో శుక్రవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు ప్రజలు పట్టం కట్టాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోరుకునే ప్రతీ ఒక్కరూ టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, బొడ్డు వెంకన్న దేవళ్ల బోసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

సామర్లకోట, మార్చి 1: సామర్లకోటలో సంగీతరావుపేటకు చెందిన ఇద్దరు మాజీ కౌన్సిలర్లు శుక్రవారం ఎమ్మెల్యే చినరాజప్ప సమక్షంలో టీడీపీలో చేరారు. నీలమ్మ చెరువు వద్ద నుంచి మేళతాళాలతో రాజప్పను మాజీ కౌన్సిలర్లు సప్పా సుబ్రహ్మణ్యేశ్వరరావు, గండ్రేటి సూర్యకుమారి, కార్మిక సంఘం నాయకుడు గండ్రేటి రమణల ఇంటికి తోడ్కోనిరాగా పార్టీలోకి చేరిన మాజీ కౌన్సిలర్లకు పార్టీ కండువాలను కప్పి రాజప్ప ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని రాజప్ప పట్టణంలోని పారిశ్రామికవేత్తలు నేమాని సుబ్బారావు, మహేష్, బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, జనసేన నాయకుడు బిక్కిన రాజశేఖర్ కుటుంబాలను కలిసి కోరారు. డాక్టర్ యార్లగడ్డ సత్యనారాయణ తదితర ప్రముఖుల కుటుంబాలను కలిశారు.

నాకు అండగా నిలవండి

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, మార్చి 1: స్థానికుడిగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారి సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్న తనకు అండగా నిలవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌వీఎస్ఎన్ వర్మ కోరారు. పిఠాపురంలో శుక్రవారం జరిగిన మొక్కజొన్న వర్తక సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలన్నారు. మొక్కజొన్న వ్యాపారస్తులు తమ వ్యాపారం నిర్వహించుకునేందుకు వీలుగా ఆర్టీసీ బస్‌స్టేషన్, టోల్‌గేట్, ఆర్వోబీ వద్ద స్థలాలు కేటాయింపునకు కృషి చేస్తామని, వ్యాపారస్తులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో మొక్కజొన్న వర్తక సంఘం నాయకులు కీర్తి దొరబాబు, కొత్తెం మాధవ, ఆకుల రాముడు, తలారి శ్రీను, కొత్తెం సత్తులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, సోము సత్యనారాయణ, నామా దొరబాబు, పిల్లి చిన్నా, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను, గోవిందు, సూరవరపు సుబ్బారావు, మొల్లి నాగమరిడిరాజు, మసకపల్లి రాజా, మట్టా గణేష్, నూతాటి ప్రకాష్ ఉన్నారు.

రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వం

పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 1: సీఎం జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, ప్రజాశీస్సులతో అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వమని జనసేన కాకినాడ రూరల్ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. శుక్రవారం రాత్రి పండూరులో పార్టీ ఎంపీటీసీ సభ్యులు నందిపాటి అనంతలక్ష్మిత్రిమూర్తులు, నందిపాటి వెంకటరమణ, లారీ యూనియన్ మాజీ అధ్యక్షుడు బావిశెట్టి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో సుమారు 150 మంది జనసేనలో చేరారు. వారికి జనసేన కండువాలు వేసి నానాజీ ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కరెడ్ల గోవిందు, టీడీపీ నేత బావిశెట్టి శ్రీను, మాజీ సర్పంచ్‌లు బావిశెట్టి ప్రసాద్, కొల్లాబత్తుల వీరబాబు, నందిపాటి సత్తిబాబు, గుమ్మెళ్ల సత్యానందం, జి. శ్రీనివాస్, మాదారపు తాతాజీ, సోదె మునలయ్య, జీనిశ్రీనివాస్ పాల్గొన్నారు.


సర్పవరం జంక్షన్: జనసేనలో చేరినవారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న నానాజీ

కనీస సదుపాయాలు కల్పించాలి

కాకినాడ సిటీ, మార్చి 1: కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు లేవని, తాగునీరు లేదని ప్రజలు వాపోయారని, గ్రామాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని పంతం నానాజీ కలెక్టర్‌ను కోరారు. తొలుత టీడీపీ-జనసేన శ్రేణులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి టీడీపీ నేతలు చప్పిడి వెంకటేశ్వరరావు, రామదేవు సీతయ్యదొరతో కలిసి వినతిపత్రం సమర్పించారు. జనసేన నేతలు పాల్గొన్నారు.

బేటీ బచావో, బేటీ పడావోపై ర్యాలీ



కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 1: బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శుక్రవారం భానుగుడి సెంటర్ నుంచి జగన్నాథపురం బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. కైట్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పోతుల ఐశ్వర్య ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో 1700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ దేశానికి గర్వకారణమని,బీజేపీ గెలుపు-భారత్ గెలుపు నినాదాలు చేశారు.

గోతులు పూడ్చరా?

కొత్తపల్లి, మార్చి 1: ధ్వంసమైన కొండెవరం-పిఠాపురం రోడ్డులో ఏర్పడిన గోతులు పూడ్చకపోవడంపై ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో ఉప్పాడ నుంచి కొండెవరం మీదుగా పిఠాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో అక్కడక్కడ రోడ్డు బాగా ఛిద్రమైంది. పిఠాపురం దగ్గర్లో లారీ సప్లయి కార్యాలయం నుంచి కొండెవరం శెట్టిబలిజపేట రామాలయం వరకు రోడ్డు పలు చోట్ల ఛిద్రమైంది. కొన్ని చోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల లారీ సప్లయి కార్యాలయం వద్ద రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. నవఖండ్రవాడ వరకు ఉన్న చిన్నపెద్ద గోతులను పూడ్చి, కూత వేటు దూరంలో ఉన్న జోగిరాజుపేట, శెట్టి బలిజపేట వద్ద రహదారి గోతులను పూడ్చకుండా వదిలేయడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండయ్యకాలువ సమీపంలో ములపు, సూరప్ప చెరువు సమీపంలో ములుపుల్లో పడిన గోతులను కూడా పూడ్చకుండా వదిలేయడంపై ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. కొండెవరం,పిఠాపురం రోడ్డుల్లో గోతులను తక్షణం పూర్తి చేయాలని అధికారుల్ని ప్రయాణికులు కోరుతున్నారు.


కొండెవరం రోడ్డులో గోతి

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్!



సామర్లకోట, మార్చి 1: పెద్దాపురం రోడ్డులో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం సమీపాన రోడ్డుకు అను కుని ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తుప్పలు, పొదలు పెరిగి ప్రమాదంగా మారింది. పచ్చిక మేసేందుకు వెళ్లే మేకలు, పశువులు పొదలను తాకిన వెంటనే విద్యుద్ఘాతానికి గురవుతు న్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ప్రాకారాలను తుప్పలు, పొదల నుంచి రక్షణ కల్పించాలని విద్యుత్ ఎస్ఈ (రాజమండ్రి)కి ప్రజలు ఫిర్యాదులు చేశారు.

రత్నగిరిపై చండీహోమం

అన్నవరం, మార్చి 1: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు.

బాలాత్రిపుర సుందరికి పూజలు

కాకినాడ కల్చరల్, మార్చి 1: కాకినాడ సూర్యారావుపేటలోని శ్రీరామలింగేశ్వరస్వామి సమేత బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, దేవస్థానం ఛైర్మన్ పెద్ది రత్నాజీ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8న మహాశి వరాత్రి రోజున రామారావుపేటలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఛైర్మన్ బి.రమేష్ తెలిపారు.

అడవిరాజులబాబు పండుగ

కోటనందూరు, మార్చి 1: గ్రామాల్లో రామలక్ష్మణులను ఆరాధ్యదైవంగా భావించే అడవిరాజులబాబు పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తమ సమీప పొలంలోకి వెళ్లి కుటుంబాలవారిగా భోజనాలు చేశారు. మండలంలోని కెఎమల్లవరం, అల్లిపూడి, జగన్నాథపురం, బిళ్లనందూరు,ఎస్అర్‌పేట, కెఇచిన్నయ్యపాలెంలోతో పాటు పలు గ్రామాల్లో అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

ప్రత్తిపాడు: పెద్దశంకర్లపూడి గ్రామంలో ఎత్తైన కొండపై ఆలయం వద్ద అడవిరాజులబాబు పండుగ ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కలగ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సామర్లకోట, మార్చి 1: సామర్లకోట రైల్వే స్టేషన్లో రూ. 25.37 కోట్ల వ్యయంతో చేపట్టిన అమృత్‌భారత్ స్టేషన్ అభివృద్ధి పనుల అమలుతీరును కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ శుక్రవారం పరిశీలించారు. స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ అభివృద్ధి పనులను ఎంపీకి వివరించారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ వెళ్లేందుకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి ఎంపీ తరలివెళ్లారు. సామర్లకోట రైల్వే ఆర్పీఎఫ్ ఎస్‌ఐ రామకృష్ణ, రైల్వేపోలీస్ ఎస్‌ఐ బి.లోవరాజు, తదితర రైల్వే అధికారులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రత్తిపాడు, మార్చి 1: ప్రత్తిపాడులోని బీసీ బాలికల వసతి గృహంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ప్యానల్ అడ్వకేట్లు బుగతా శివ, ఎ.దేవి మాట్లాడుతూ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హక్కులను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. వసతి గృహంలోని విద్యార్థులకు సరఫరా చేస్తున్న భోజనం ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్ శైలజ ఉన్నారు.

డీజిల్ చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, మార్చి 1: వాహనం నుంచి డీజిల్ చోరీ చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి జంక్షన్ వద్ద 16వ జాతీయ రహదారిపై లారీ నుంచి డీజిల్‌ను తస్కరిస్తున్నట్లు అందిన సమాచారంతో పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీలు దాడులు చేశారు. 120 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

బెల్లపుఊట ధ్వంసం

తునిరూరల్, మార్చి1: తుని ఎస్ఈబీ స్టేషన్, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఎస్ఈబీ, అధికారులు తొండంగి పోలీసులతో కలిసి విస్తృత దాడులు చేపట్టారు. వేమవరంలో పెద్దఎత్తున సారా కాస్తున్న స్థావరాలను గుర్తించారు. అక్కడ దాచి పెట్టి ఉన్న 6400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు తుని ఎస్ఈబీ ఎస్‌హెచ్‌వో పి.చిట్టిబాబు తెలిపారు.

గ్రావెల్ లారీలు స్వాధీనం

గొల్లప్రోలు, మార్చి 1: గొల్లప్రోలులో 2 గ్రావెల్ లారీలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పదోవ వార్డు శివారులోని నాన్‌లేఅవుట్ స్థలంలో అనుమతులు లేకుండా ఫిల్లింగ్ చేస్తున్నారన్న సమాచారంతో తహశీల్దార్ ఉదయభాస్కర్ ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. అక్కడకు వచ్చిన రెండు గ్రావెల్‌లారీలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో ఆర్ఐ సురేష్, వీఆర్వో కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో స్వాధీనం చేసుకున్న గ్రావెల్ లారీ